



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com


గుంటూరు పల్నాడు

మంగళవారం 13 మే 2025 - పేజీలు 8

# పల్నాడుకు నామినేటెడ్ పదవులు..

పల్నాడు జిల్లాలో కష్ట నష్టాలు భరించి పార్టీ జెండాలు మోసం.... నామినేటెడ్ పదవుల్లో కూడా న్యాయం దక్కలేదు.. పార్టీ నేతలకు.. నాయకులకు చెప్పి చెప్పి విసిగి వేసారి పోయాం... ఒక్క కీలకమైన పదవి అయినా పల్నాడు కి ఇచ్చారా.. వైకాపా హయాంలో ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చారు... కూటమి అధికారంలోకి వచ్చింది..కనీసం ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వలేదు.. పదవుల్లో పల్నాడు జిల్లాకు కీరని అన్యాయం జరుగుతోంది.. ఎవరికి చెప్పుకుంటే తమ బాధలు తీరుతాయి... వైకాపా ఐదేళ్ల పాలనలో ఆర్థికంగా... రాజకీయంగా నష్టపోయాం... దెబ్బతిన్న దేశం నాయకులు ఇప్పటికీ ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి... పల్నాడు జిల్లాపై కూటమి నేతల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా కొన్ని నామినేటెడ్ పదవులను ఇవ్వలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు కూడా అన్యాయం జరుగుతోందని జనసేన, భాజపా నేతలు కూడా గుర్రుగా ఉన్నారు. కష్టపడి పార్టీ గెలుపుకి పనిచేశాం. మాకు ప్రాధాన్యత లేదా? అంటూ కూటమిలో భాగస్వాములైన జనసేన, భాజపా నేతలు నిట్టూరుస్తున్నారు.. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో రాయలసీమ, కోస్తా, గుంటూరు, ప్రాంతాల కు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొన్ని కీలకమైన నామినేటెడ్ పోస్టులను ప్రకటించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్నా, పనిచేసే వారికే పదవులు, జెండా మోసిన వారిని గుర్తిస్తా అంటూ కాలయాపన చేస్తూ ఇంకో ఏడాది గడిపిన ఆశ్చర్యపోనవసరం లేదని కూటమి నేతలు అధినేత తీరును తప్పుపడుతున్నారు.. ఈసారి జాబితాలోనైనా పల్నాడుకు అవకాశం ఉంటుందో లేదో చూద్దాం....

## రావా..!



- జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం
- గరం గరంగా కూటమి నేతలు
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి
- జెండాలు మోస్తే పదవులేవి

పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ, జనసేన, భారతీయ జనతా పార్టీ లు కూటమిగా ఏర్పడిన ఈ ప్రభుత్వం అనేక కార్పొరేషన్లు, సంస్థలు, బోర్డులలో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది. అయితే ఈ ప్రక్రియలో పల్నాడు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలోని టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ, వారి ఆకాంక్షలు నీరుగారిపోతున్నాయి.

### నామినేటెడ్ పదవుల్లో పల్నాడుకు అన్యాయం

కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 22 నామినేటెడ్ పదవులను ప్రకటించింది, వీటిలో టీడీపీకి 15, జనసేనకు 3, బీజేపీకి 1, అమరావతి జేఏసీకి 2, ఒక స్వతంత్ర అభ్యర్థికి 1 పదవి కేటాయించారు. అయితే ఈ పదవుల్లో పల్నాడు జిల్లాకు ఒక్క చైర్మన్ పదవి కూడా దక్కలేదు. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావుకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి మాత్రమే లభించింది, ఇది కూడా ఒక సాంకేతిక పదవిగానే పరిగణించబడుతోంది. పల్నాడు జిల్లా ఏడు నియోజకవర్గాలు (వినుకొండ, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు) కలిగి ఉంది. ఈ నియోజకవర్గాల్లో మూడు పార్టీలకు చెందిన అనేకమంది నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులుగా ఉన్నారు. ఉదాహరణకు నరసరావుపేటకు చెందిన జనసేన నాయకుడు సయ్యద్ జిలానీ, టీడీపీ నాయకులు నల్లపాటి రాములు, వినుకొండకు

మిగతా 3లో





# పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి
- కొల్లిపరలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న మంత్రి
- 1.46 కోట్ల కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం
- ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతు ఖాతాకు డబ్బులు జమ చేశాం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండల

మిగతా 3లో

## ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు చొరవతో
# పల్లె బాటలకు మహర్దశ

**నరసరావుపేట, మేజర్ న్యూస్:** నరసరావుపేట ఎంపీ,టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీ కృష్ణ దేవరాయలు చొరవతో మరోసారి పల్నాడు గ్రామాల్లోని డొంకలు, పొలాలు రోడ్లు అభివృద్ధి బాట పట్టనున్నాయి. తరచు రైతులు, గ్రామస్థుల నుండి వస్తున్న అభ్యర్థణల మేరకు.. గత ప్రభుత్వంలో ఎంపీగా ఉన్నప్పుడు మంచి ఆలోచన చేసి.. తన సొంత నిధులు,

మిగతా 3లో



## కలెక్టరేట్లో 199 ఫిర్యాదుల స్వీకరణ



**గుంటూరు, మేజర్ న్యూస్ :** సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు , లక్ష్మీ కుమారి, ఆర్డిఓ కే.శ్రీనివాస రావు, జెడ్పీ సిఇఓ జ్యోతిబసు ప్రజల నుండి 199 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని గడువులోపు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన పిటీషన్లు గుణాత్మకంగా, సహేతుకంగా ఉందా , లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి డియం అండ్ హెచ్ ఓ డా. శ్రావణ బాబు , సిపిఓ శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మై భారత్ పోర్టల్ లోసివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవటానికి యువతకు అవకాశం

**కిరణ్మయి దేవిరెడ్డి**




**గుంటూరు, మేజర్ న్యూస్:** మై భారత్ పోర్టల్ లో సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా రిజిస్టర్ చేసుకో వాలని యువతను గుంటూరు జిల్లా నెహ్రూ యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ,మై భారత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువతను దేశానికీ ఉపయోగపడే విధంగా,ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు మరియు సంక్షోభ సమయాల్లో కీలక పాత్రలు పోషించడానికి సాధికారత కల్పించే సమిష్టి ప్రయత్నంలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ప్రజా అత్యవసర పరిస్థితులు మరియు ఇతర ఊహించని పరిస్థితులలో ప్రతిస్పందించే విధంగా స్వచ్ఛంద సేవకులను నిర్మించడం మే లక్ష్యంగా మై భారత్ సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు గా నమోదు చేసుకోవడానికి ఇది ఒక సువర్ణ అవకాశం అని అన్నారు.ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న భద్రతా సమస్యల దృష్ట్యా, బలమైన, సమాజ ఆధారిత ప్రతిస్పందన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని,యువత భాగస్వామ్యంతో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి రెస్క్యూ, తరలింపు కార్యకలాపాలు, ప్రథమ చికిత్స మరియు అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, జన సమూహ నియంత్రణ, ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన మరియు పునరావాస ప్రయత్నాలలో సహాయం చేయడం వంటి సేవల ద్వారా మద్దతు ఇవ్వడం ద్వారా పౌర రక్షణ వాలంటీర్లు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తారు అని అన్నారు. ఇప్పటికే మై భారత్ పోర్టల్ లో రిజిస్టర్ కాబడిన మై భారత్ వాలంటీర్లు మరియు దేశానికి సేవ చేయాలనుకునే ఆసక్తి ఉన్న యువత మై భారత్ పోర్టల్లో %షిషి.ఎఎఫ్టుుతీఫ్.స్త్రశీజ.అఅ% ఇవ్వబడిన సరళమైన రిజిస్టర్ ప్రక్రియ ద్వారా సమాజం పట్ల తమ బాధ్యత పెంపొందించుకోవటమే కాకుండా, క్లిష్టమైన పరిస్థితుల్లో వేగంగా ప్రతి స్పందించడానికి మరియు ప్రాణాలను రక్షించే నైపుణ్యాలు కలిగిన శిక్షణలో భాగం కావాలని కోరారు.మరిన్ని వివరాలకు నెహ్రూ యువ కేంద్ర గుంటూరు కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు..

# సమ్మర్ క్యాంప్ ప్రారంభం




**తాడేపల్లి, మేజర్ న్యూస్:** డాన్ బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చిగురు బాలల ఆశ్రమంలో నెలరోజుల సమ్మర్ క్యాంపును ఆ సంస్థ డైరెక్టర్ రత్న ఫాదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో పిల్లలందరూ అన్ని విషయాలలో బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. మీ బంగారు భవిష్యత్తుకు మీ విలువైన సమయాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ నెల రోజుల సమ్మర్ క్యాంపులో సైబర్ క్రైమ్ ,బాలల హక్కులు , లైఫ్ స్కిల్ ఎడ్యుకేషన్ మరియు తదితర అంశాలపై అవగాహన కల్పించడం మరియు పిల్లలందరికి మానసిక వికాసం కొరకు క్రాఫ్ట్ వర్క్ ,ఆర్ట్ వర్క్, ఆటలు, పాటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ స్టాఫ్, పిల్లలు పాల్గొన్నారు.

## భారీగా దిగొచ్చిన పసిడి ధర..!



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** భౌగోళిక ఉద్రిక్తలతో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బంగారం ధరకు కళ్లెం పడింది. అమెరికా- చైనా మధ్య టారిఫ్‌లకు 90 రోజుల పాటు బ్రేక్ పడిన నేపథ్యంలో పసిడి ధర భారీగా తగ్గింది. మొన్నటి వరకు అంతర్జాతీయ మార్కెట్‌లో 3400 డాలర్ల ఎగువన ట్రేడయిన ఔన్సు బంగారం ధర.. 3218 డాలర్లకు దిగొచ్చింది. అంతర్జాతీయ ధరకు అనుగుణంగా దేశ రాజధాని దిల్లీలోనూ 10 గ్రాముల పసిడి ధర రూ.96,550కు చేరింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో హైదరాబాద్‌లో బులియన్ మార్కెట్లో 10 గ్రాముల పసిడి ధర రూ. 96,125 వద్ద ట్రేడవుతోంది. శనివారం రూ.99,950 వద్ద ట్రేడయిన పసిడి రూ.3,400 మేర తగ్గింది. వెండి సైతం కిలో రూ.200 మేర తగ్గి రూ.99,700 వద్ద ట్రేడవుతోంది. పోటాపోటీగా టారిఫ్‌లు విధించుకున్న అమెరికా-చైనా సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాయి. అమెరికా తన సుంకాలను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గించేందుకు అంగీకరించగా.. చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై 10 శాతం మాత్రమే సుంకం విధించేందుకు ఓకే చెప్పింది. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల్లో పురోగతి, భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం వంటి ఉద్రిక్తతలు తగ్గించే చర్యలు బంగారంలో భారీగా పెట్టుబడులు చేసిన వారు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు దిగారు. దీంతో బంగారం ధర దిగొచ్చిందని అనలిస్టులు పేర్కొంటున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ కూడా పుంజుకొని మళ్లీ 101.76కు చేరడం కూడా మరో కారణమని చెబుతున్నారు.

## పెసరకు దక్కని మద్దతు ధర..!

**గుంటూరు, మేజర్ న్యూస్** మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో రబీ సీజన్‌లో సాగు చేసిన పెసరకు మద్దతు ధర దక్కడం లేదు. ఈ పంటకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.8,682 కాగా మార్కెట్‌లో క్వింటా రూ.7,100 నుంచి రూ.7,200 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. 1.37 లక్షల ఎకరాల్లో పెసరను సాగు చేయగా 6 లక్షల క్వింటాళ్లకు పైగా ఉత్పత్తి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికి 30 వేల క్వింటాళ్లు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరవడం, సాంకేతిక కారణాలతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలతో నూర్పిడి చేయడంతో పెసల్లో మట్టి, రాళ్లు వస్తున్నాయి. దీంతో యంత్రం ద్వారా జల్లెడ వేసిన తర్వాతే వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జల్లెడ వేసే యంత్రాలు తక్కువగా ఉండటం కూడా ఈ ఆలస్యానికి మరో కారణం. ఫలితంగా రైతులు తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని నష్టపోతున్నారు.

**నిల్వలను విడుదల చేయడమే కారణం**

రాష్ట్రంలో పండే పెసలు ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. నాఫెడ్ గతంలో కొనుగోలు చేసిన పెసర నిల్వలను ఇప్పుడు ఉత్తర భారతదేశంలో మార్కెట్‌లోకి విడుదల చేయడంతో అక్కడ లభ్యత పెరిగింది. తద్వారా మన రాష్ట్రం నుంచి ఎగుమతయ్యే సరకుకు డిమాండ్ తగ్గింది. దీంతో ఇక్కడ క్వింటా రూ.7,100 నుంచి రూ.7,200 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ధర్నా



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పున్జవ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సరైన విధానం కాదని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.శ్రీనివాస రెడ్డి, ఎం. మోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం పాఠశాల విద్యాశాఖ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఇఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టరేట్ లో ఏఓ కు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి-1,ఏడి-2 లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీఓ విడుదల చేసి పాఠశాలలను పున్జవ్యవస్థీకరించాల న్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అన్ని మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో 5 తరగతులు బోధించడానికి 5 గురు ఉపాధ్యాయులను, విద్యార్థుల సంఖ్య 120కి మించితే 6 వ ఎస్.జి.టి., ఆ పైన ప్రతి 30 మందికి ఒక ఎస్.జి.టి. చొప్పున కేటాయించాలని అన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాల న్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంను కొనసాగించాని తరగతిలో విద్యార్థులు 45 మించిచే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. హైస్కూల్ లో విద్యార్థుల సంఖ్య 300 దాటితే అదనపు పిడి. పోస్టు కేటాయించాలన్నారు. బదిలీల జీఓ విడుదల చేసి వేసవి సెలవులలో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎస్.జి.టి.లకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియచేపట్టాలన్నారు. జిల్లాలో సీనియారిటీ సమస్యలు పరిష్కరించిన తర్వాతనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని బదిలీలు, పదోన్నతులు ప్రక్రియలు వేర్వేరుగా నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుల్లో కూడా అర్హులైన ఎస్.జి.టి.లకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయాకార్యక్రమాలలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. ఖాసీం పీరా, సహఅధ్యక్షులు ఏ. బాగేశ్వరి దేవి, జెవిడి నాయక్, కోశాధికారి ఎం.రవిబాబు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ - యుటిఎఫ్ జిల్లా ఇంచార్జ్ టిఎస్.ఎన్ మల్లీశ్వరరావు, జిల్లా కార్యదర్శిలు ఉషా సౌరి రాణి, టి.వెంకట్, కె.తిరుపతిస్వామి, ఆర్ నాసర్ రెడ్డి, ఏ శ్రీనివాసరావు, డి.లింగయ్య, జిలాని, చిన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు....

# పాపం పల్నాడుకు నామినేటెడ్ పదవులు రావా..!

మొదటి పేజీ తరువాయి

చెందిన మక్కెన, గురజాలకు చెందిన జంగా, చిలకలూరిపేటకు చెందిన మల్లెల రాజేష్‌లు వంటి వారు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ వీరిలో ఎవరికీ ఇప్పటివరకు అవకాశం రాలేదు.

**ప్రాంతీయ అసమానతలు**

ప్రకటించిన 22 నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ భాగం తిరుపతి (3), ఏలూరు (2), తాడేపల్లిగూడెం (2), గుంటూరు (1), నెల్లూరు (1) వంటి జిల్లాలకు కేటాయించబడ్డాయి. పల్నాడు జిల్లాకు కేవలం ఒక డైరెక్టర్ పదవి మాత్రమే దక్కింది, ఇది జిల్లా రాజకీయ ప్రాముఖ్యతకు సరిపోదని విమర్శకులు అంటున్నారు. టీడీపీ నామినేటెడ్ పదవుల్లో 68% (15/22) ఆక్రమించగా, జనసేనకు 14% (3/22), బీజేపీకి 5% (1/22) మాత్రమే దక్కాయి. పల్నాడులో జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించినప్పటికీ, వారికి ఒక్క పదవి కూడా రాకపోవడం అసంతృప్తికి కారణమైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కనీసం 10 జిల్లాలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. అయితే పల్నాడు జిల్లా ఈ జాబితాలో చోటు సంపాదించలేకపోయింది, ఇది జిల్లా నాయకుల్లో నిరాశను పెంచింది.పల్నాడు జిల్లాలో జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎన్నికల సమయంలో టీడీపీ జెండాలు మోసి, కూటమి విజయానికి కృషి చేశారు. అయినప్పటికీ నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా, బీజేపీ నాయకులు కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో వారి కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. పల్నాడులో ఈ అసంతృప్తి మరింత తీవ్రంగా ఉంది, ఎందుకంటే జిల్లాలో ఈ మూడు పార్టీలకు బలమైన కార్యకర్తల నెట్‌వర్క్ ఉంది.గత టీడీపీ ప్రభుత్వాల్లో కూడా పల్నాడు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లభించలేదనే వాదన ఉంది. 2014-19 మధ్య కాలంలో కూడా జిల్లా నాయకులు ఇదే విధమైన నిరాశను వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఈ చరిత్రను పునరావృతం చేస్తోందని జిల్లా నాయకులు ఆరోపిస్తున్నారు. “పల్నాడు జిల్లాకు ఎప్పుడూ మొండి చేయి చూపిస్తారు. మా కార్యకర్తలు ఎన్నికల్లో పనిచేసినా, పదవుల విషయంలో మాకు ఎప్పుడూ అన్యాయమే” అని ఒక స్థానిక జనసేన నాయకుడు వాపోయాడు.

**రాజకీయ పరిణామాలు**

పల్నాడు జిల్లాలో నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఈ అసమానతలు కూటమి భాగస్వాముల మధ్య అంతర్గత విభేదాలకు దారితీసే అవకాశం ఉంది. జనసేన, బీజేపీ కార్యకర్తలు టీడీపీ ఆధిపత్య ధోరణిని ప్రశ్నిస్తున్నారు. “మేము కూటమిలో భాగస్వాములం కాదా? మా కార్యకర్తలకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదు?” అని ఒక బీజేపీ నాయకుడు ప్రశ్నించాడు. ఈ అసంతృప్తి భవిష్యత్ ఎన్నికల్లో, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యతపై ప్రభావం చూపవచ్చు. పల్నాడు జిల్లా రాజకీయంగా సున్నితమైన ప్రాంతం కావడంతో ఈ నిరాశ కార్యకర్తల ఉత్సాహాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయం కూటమి ప్రభుత్వంలోని అంతర్గత సమన్వయ లోపాన్ని సూచిస్తోంది. జిల్లా కార్యకర్తల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేయడం వల్ల కూటమి ఐక్యతకు గండి పడే ప్రమాదం ఉంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే, రాజకీయంగా కీలకమైన పల్నాడు జిల్లాలో కూటమి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. కూటమి నాయకత్వం ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు చొరవతో

# పల్లె బాటలకు మహర్దశ

మొదటి పేజీ తరువాయి

కొంత రైతుల సహకారం తీసుకుని మంచి ప్రణాళికలతో గ్రామాల్లోని రోడ్లను, డొంకలను అభివృద్ధి చేయించిన విధానాన్ని మరలా పునరావృతం చేయిస్తున్నారు. కేవలం 10 నెలల్లో 86 గ్రామాల్లో,, 435 కి. మీ మేర గతంలో అభివృద్ధి చేసి.. ఆ గ్రామాల్లో కొత్త కళను తీసుకు వచ్చారు. అలాగే మరలా పల్నాడు ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనతో శ్రీ కృష్ణ దేవరాయలు.. ఈరోజు అభివృద్ధి పనులను ప్రారంభింప చేశారు.ఎంపీ కృష్ణ దేవరాయలు తన సొంత నిధులని వెచ్చించి.. మెషినరీ ( క్రేన్ లను ) పంపిస్తే.. గ్రామంలోని నాయకులు, రైతులు.. ఆయిల్ కొట్టించుకుని,, లభ్యతను బట్టి గ్రావెల్, మట్టిని సేకరించి.. అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారు. సోమవారం కారంపూడి మండలం, కాకానివారి పాలెంలో,, 3కి. మి మేర రోడ్డు అభివృద్ధికి పనులు ప్రారంభం అయ్యాయి. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించుకునేందుకు రైతులు, నాయకులు, గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు

# పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

కేంద్రంలోని శ్రీ జనార్ధన స్వామి వారి దేవస్థానం ( చిన్న దేవుని గుడి) సమీపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్ , జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ పాల్గొని ప్రజల నుండి 200 ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ , నూతన రైస్ కార్డుల కొరకు దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో అందాయన్నారు. అర్జీలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర పౌర సరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి నెల 9 వేల 600 మందికి రూ.40 కోట్లు రూపాయలు ఎన్ టీ ఆర్ పెన్షన్ క్రింద అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే క్రొత్తగా ఒక కోటి 46 లక్షల మందికి రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. అర్హత కలిగిన వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొల్లిపర మండలంలో రైతులకు సంబంధించి డొంక రోడ్లు అభివృద్ధి కోసం రూ.10 కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. రైతులకు మంచి జరగాలనే ఉద్దేశ్యంతో మొట్ట మొదటగా కొల్లిపర మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో రూ 12వేల కోట్ల నగదును జమ చేసినట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు రోడ్డును విస్తరణ చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయటానికి ఇప్పటికే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు అక్రమణకు గురైతే పంచాయతీరాజ్ శాఖ ద్వారా తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. పారిశుధ్యం విషయంలో ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. గతంలో స్పీకర్ గా ఉన్నప్పుడు రక్షిత మంచినీటి పథకానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. గ్రామాల్లో దొంగతనాలు పెరిగి పోవడం వలన పోలీసు శాఖపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దొంగతనాలు అరికట్టడానికి పోలీసు శాఖ ద్వారా గట్టి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. యువత గంజాయికి అలవాటుబడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. నెల రోజుల లోపులో గంజాయిని అరికట్టనున్నట్లు తెలియ జేశారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 4వేల సంక్షేమ వసతి గృహాలకు సన్నబియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ కొల్లిపర గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్ కొల్లిపరలో జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి సోమవారం మండల, డివిజన్ , జిల్లా స్థాయిలతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని , కాని ఈ రోజు మీ సమస్యల పరిష్కారానికి మీ వద్ద పీజీఆర్ఎస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యంత ప్రాధాన్యతతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను మండల , డివిజన్,జిల్లా స్థాయిలతో జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ఒక నిర్ణీత గడువు ఏర్పాటు చేసుకుని ఆ గడువు లోపల పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎక్కువగా మ్యూటేషన్ , రీ సర్వే , రెవెన్యూ అంశాలకు సంబంధించిన అందిన అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించే విధంగా పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగసాయి కుమార్, డిఇఓ సివి రేణుక, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వేంకటేశ్వర్లు, తెనాలి వ్యవసాయ శాఖ ఏడి ఉషారాణి , తెనాలి డిఎస్పీ జనార్ధన రావు, కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక, తహసీల్దార్ సిద్ధార్థ , ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి , వెటర్నరీ అధికారి సాయి సతీష్ రాజు , వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. భరత్ , ఎలక్ట్రికల్ ఏఈ ప్రదీప్ కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వంగా సాంబి రెడ్డి , బీసీ నాయకులు అద్దంకి వేణుగోపాల్ గౌడ్ , జనసేన నాయకులు అడపా నారాయణ రెడ్డి , భీమవరపు కిషోర్ రెడ్డి , మండల, జిల్లాకు సంబందించిన వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డుల మంజూరు చేయాలి

- ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి
- ఉర్దూ పాఠశాలల ఏర్పాటు, పోస్టులు భర్తీ చేయాలి
- మంత్రి నారా లోకేశ్ కు వినతిపత్రం అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేశ్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డుల మంజూరు, ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ విన్నవించారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ను ఎమ్మెల్యే నసీర్ మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే టీచర్లు విద్యార్థులను తీర్చిదిద్దడంలో శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని, వీరు ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురైనప్పుడు చికిత్స తీసుకునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రైవేటు టీచర్లు కరోనా సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉర్దూ సాహిత్యానికి ప్రోత్సాహం, ఉర్దూ మాధ్యమంలో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు ద్వారా చేయడంపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తుతం కర్నూలులో మాత్రమే ఉందని, అమరావతి రాజధానిలో కూడా యూనివర్సిటీ రీజనల్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజధానిలో రీజనల్ బ్రాంచ్ ఏర్పాటు ద్వారా ఉర్దూ మాధ్యమంలో వృత్తి, సాంకేతిక విద్యను అందించడానికి ఈ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లోనూ ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నూతనంగా ఉర్దూ పాఠశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రస్తుత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పార్టీని తమ భుజస్కందాలపై మోసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని విన్నవించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి జెండా అని చెప్పారు. పై సమస్యలను సావధానంగా ఆలకించిన మంత్రి నారా లోకేశ్ ప్రతి సమస్యా పరిష్కారంపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ కు హామీ ఇచ్చారు.

## ఏపీలో గెస్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

**గుంటూరు, మేజర్ న్యూస్:** ఏపీలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారికి జీతాలు పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గంటకు ఇస్తున్న రూ. 150 పారితోషికాన్ని రూ.375కు పెంచగా, నెలకు అత్యధికంగా రూ.27,000గా నిర్ణయించింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని తెలిపింది.

## బుద్ధుని మార్గమే అనుసరణీయం

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** అహింస మూర్తి, కరుణ, ప్రేమ స్వరూపుడు ,అంగీరసుడు శాక్యముని, శాక్య జ్ఞాని ,గౌతమ బుద్ధుని 2589 వ జయంతి కార్యక్రమాన్ని శ్రీనాథ సాహితీ పరిషత్ మరియు ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో నరసరావుపేట ప్రకాష్ నగర్ లోని శ్రీ తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాల యందు నిర్వహించడమైనది. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రపంచానికి శాంతి సందేశం సర్వ మానవ సౌభ్రాతృత్వ సందేశం, దుఃఖ కారణ చతురార్య సత్యాలు, పంచశీల సిద్ధాంతం , దొంగ నుండి మనిషిగా మారిన అంగుళీమాలుని కథ తదితర అంశాలను వివరించారు . ప్రపంచ సమస్యలకు పరిష్కారం గౌతమ బుద్ధుని బోధనలోనే ఉందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారావు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఆ మంచి లక్షణాలు రావాలంటే గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను అర్థం చేసుకొని అధ్యయనం చేయాలని అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ పనులు తామే చేసుకోవాలని, క్యారెక్టర్ అనగా శీలం మరియు ప్రజ్ఞ అనే పదాల గురించి అర్థం చేసుకొని ఉన్నతమైన ఆశయాలతో మెలగాలని తెలిపారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పమ్మి.వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ విద్యా ఒత్తిడిలో మిగతా పుస్తకాలను చదవలేదని వారు తప్పనిసరిగా ప్రముఖ చరిత్రకారుల పుస్తకాలు, బుద్ధుని జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని అన్నారు.,. మేధస్సు వికసించాలంటే గౌతమ బుద్ధుని చరిత్రను అధ్యయం చేయాలని ఉపాధ్యాయులు జాలయ్య అన్నారు. బుద్ధుడు దుఃఖాన్ని జయించడానికి మనిషి లో పరివర్తన తేవడానికి అష్టాంగ మార్గం అవసరమని ,సమ్యక్ దృష్టి, సమ్మెకు ఆలోచన ,సమ్యక్ కృషి చేయాలని ఉపాధ్యాయులు రామిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు గౌతమ బుద్ధుని చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు ఎస్. పురుషోత్తం రాజు, యం. బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

**- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుని కోరిన "రూట"**


సయ్యద్ ఇక్బాల్
రాష్ట్ర అధ్యక్షులు


సయ్యద్ ముష్తాఖ్
రాష్ట్ర ప్రధానకార్యదర్శి

**గుంటూరు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని 11 జిల్లాలు అనగా చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖ పట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఖాళీగా ఉన్న ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ సంయుక్త ప్రకటనలో కోరారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి ,ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డిఐలు ఎంతో దోహద పడతారని, ఉర్దూ డిఐలు లేని కారణంగా గత దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయాయరని ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఎన్నారై లో నర్సుల దినోత్సవ వేడుకలు





**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి ఎన్నారై మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ నందు నర్సెస్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ మాట్లాడుతూ నర్సులు ఆరోగ్య సంరక్షణకు గుండెకాయ లాంటివారని, కరుణ, అంకితభావానికి కట్టుబడి సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశాన్ని కాపాడుతూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు సంతాపం తెలిపారు. మెరుగైన పని, పరిస్థితుల కోసం యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని, మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ శ్రేయస్సుకు కూడా తగిన ప్రాధాన్యతను ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు,ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వేంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ బైజూ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివా రావు




పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ : ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 75 ఫిర్యాదులు అందాయి.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి చెందిన బీసుపోగు మరియమ్మ భర్త అయిన ఎలమంద సుమారు 24 సం..క్రితం ఆక్సిడెంట్‌లో చనిపోయినట్లు, ఫిర్యాది మగ సంతానం అయిన 25 సం.ల అనీల్ 1 1/2 క్రితం క్యాన్సర్ తో చనిపోయినందు వలన ఫిర్యాది మామ అయిన బీసుపోగు కోటేశ్వరరావు ఫిర్యాది కి ఎలాంటి ఆస్తి ఇవ్వమని, అడిగితే ఇల్లు కూడా సంబంధం లేదు అని బెదిరిస్తునందుకు గాను ఏ ఆధారం లేని ఫిర్యాది బ్రతుకు కొరకు న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వటం జరిగింది. క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందినటువంటి మౌలాలి చికెన్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు, 2015వ సంవత్సరంలో మేడా భాస్కర రావు వద్ద స్వాతి నాకు అగ్రిమెంట్ వ్రాయించుకొని గత 10 సంవత్సరముల నుండి ఆ స్థలంలో ఎంజాయ్మెంట్‌లో ఉన్నట్లు, ఫిర్యాది స్నేహితుడైన మేకల వెంకటేశ్వరరావ అమ్మాయి వివాహం నిమిత్తం స్థలం కాగితాలను షేక్ గుడిపూడి మాబు శుభాని వద్ద తనకా పెట్టి 1,50,000 తీసుకున్నట్లు తదుపరి ఫిర్యాది 1,36,000 30 స్థలం కాగితాలు ఇవ్వమని మిగిలిన 14000 తీసుకొని వెళ్ళినట్లు అందుకు గాను షేక్ గుడిపూడి మాబు సుభాని స్థలం అమ్మేశాను నీ చేతనైతే నువ్వు నాకు ఇవ్వాల్సినది 14000 కాదు బూతులు తిట్టే అధిక వడ్డీలు వసూలు చేస్తున్నందుకు గాను గుడిపూడి మాబు సుభాని పై చట్టపరమైన చర్యలు తీసుకున్న వలసిందిగా ఎస్పీ ని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది.నరసరావుపేట షాలిం నగర్ కు చెందిన వేముల మోహన్ రావు బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ లో విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయినట్లు, ఫిర్యాదుకి షాలిం నగర్ వైఎస్ఆర్ బొమ్మ వద్ద సొంత స్థలం ఉన్నట్లు, సుమారు 2 నెలల నుండి ఫిర్యాదు కుమారుడైన వేముల ప్రసాద్ మరియు అతని కుమారుడైన వేముల దర్శన్ ప్రతిరోజు పైన తెలిపిన స్థలము వారి పేరుతో వ్రాయమని ఫిర్యాదు అద్దె కు ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తూ వారికి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ దౌర్జన్యం చేసినట్లు, సుమారు ఆరు నెలల క్రితం ఇంటి మీదకు వచ్చి ఫిర్యాదును బెదిరించి స్థలము కాగితాలు బలవంతంగా లాక్కొని వెళ్లిపోయినందుకు గాను తగిన న్యాయం కొరకు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. చిలకలూరి పేట పట్టణమునకు చెందిన సువర్ణ లక్ష్మి ఆమె చిలకలూరిపేట కు చెందిన ఢీకొండ హరి శంకర్ అనే వ్యక్తి (మిలటరీ నందు పని చేసి రిటైర్డ్ అయినాడు) పల్నాడు- కో-ఆపరేట్ - సొసైటీ బ్యాంక్ ఏర్పాటు చేసి ఆర్డీలు, చిట్టీలు వేస్తూ జనం దగ్గర డబ్బులు కట్టించుకుంటూ, సుమారు పదిమంది బాధితుల వద్ద 60,00,000/-డబ్బులు కట్టించుకుని వారికి సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నట్లు, ఈ పల్నాడు కో ఆపరేట్ సొసైటీ బ్యాంక్ నకు ఢీకొండ హరి శంకర్ బోర్డు మెంబర్ కాగా, అతని భార్య ఢీకొండ ఉమా చైర్మన్ గా వ్యవహరిస్తూ కొన్ని రోజుల క్రితం బ్యాంకును వేరే వ్యక్తులకు అప్పగించినారు. ప్రస్తుతం 60 లక్షల దాకా రావాల్సిన డబ్బుకు ఎటువంటి సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నందుకు గాను ఈ రోజు ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది. పెదకూరపాడు గ్రామానికి చెందినటువంటి దిడ్ల అనిత కు 14 సంవత్సరముల క్రితం దిడ్ల మహేష్ తో వివాహం అయినట్లు, అనంతరం ఒక మగ ఒక ఆడ సంతానం కలిగినట్లు, ఫిర్యాదు భర్త వివాహానికి ముందు నుండే మద్యానికి అలవాటు పడి డబ్బుల కొరకు ఫిర్యాదును కొడుతూ, ఇబ్బందులు పెడుతూ ఇల్లు, సంసారం అనే బాధ్యత లేకుండా ప్రతినిత్యం తాగుతున్నట్టు అదేమని అడిగితే చిత్రహింసలకు గురి చేస్తున్నందుకు గాను న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడమైనది. దుర్గి గ్రామానికి చెందిన పాలపాటి నారాయణమ్మ భర్త సుమారు 20 సంవత్సరాల క్రితం మరణించినట్లు, ప్రస్తుతం ఫిర్యాది కూతురి వివాహం చేసి అప్పుల పాలై ఇబ్బంది పడుతున్నందుకు గాను, గతంలో అదే గ్రామానికి చెందిన రుద్రోజు నాగేశ్వరరావు కు వడ్డీ కు ఇచ్చినటువంటి 1,80,000/- లు ఇవ్వమని ఎన్నిసార్లు డబ్బులు అడిగినా, పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినను డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నందుకు గాను ఫిర్యాదు తగిన న్యాయం చేయవలసిందిగా ఎస్పీ ని కలిసి అర్జీ ఇవ్వడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమమునకు వచ్చినటువంటి వారికి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఐపిఎస్ ఆదేశాల మేరకు వెల్ఫేర్ గోపీనాథ్ అధ్యక్షతన భోజనం ఏర్పాట్లు చేయడం జరిగింది.

## వసతి గృహాలలో దోమల నివారణ చర్యలు

**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని రావి రవీంద్రనాథ్ నగర్ లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల వసతి గృహం, షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహ గృహాలలో సోమవారం మలేరియా సిబ్బంది దోమల నివారణకై స్థానిక మందును పిచికారిచేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు వసతి గృహాల లోని పిల్లలకు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్నట్లు తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్యం విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి సంయుక్తంగా ప్రకటించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగ మల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు షేక్ నవీద్, షేక్ రషీద్ వార్డుహెల్త్ సెక్రటరీస్ రాజ్యం యాజలిలత, ఆశాకార్యకర్త శ్యామల, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఘనంగా చండీ హెూమం



దుగ్గిరాల, మేజర్‌న్యూస్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో సోమ వారం పౌర్ణమి సందర్భంగా ఘనంగా చండీ హెూమం నిర్వహించారు. మంగళగిరి వాస్తవ్యులు కే శ్రీనివాసరావు ఉమామహేశ్వరి దంపతులు చండీ హెూమంలో పాల్గొని 12. 11,6. రూపాయలు చెల్లించి చండీ హెూమం లో పాల్గొన్నారు . ఆలయ పూజారులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. సునీల్ కుమార్, ట్రస్ట్ దేవ భక్తుని రంగప్రసాద్, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి దాత విరాళం లక్ష రూపాయలు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ :

దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కె. శ్రీ హరి బాబు నాగేశ్వరి దంపతులు లక్ష రూపాయలు విరాళమును అందజేసినట్లు ఆలయ అధికారి కె .సునీల్ కుమార్ తెలిపారు. పెదకాకాని వాస్తవ్యులు కే. శ్రీ హరిబాబు నాగేశ్వరి దంపతులు శ్రీ మహంకాళి అమ్మవారికి లక్ష రూపాయల విరాళమును అందజేసినట్లు తెలిపారు. కె శ్రీహరిబాబు నాగేశ్వరి దంపతులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటమును, తీర్థ ప్రసాదములను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి కె సునీల్ కుమార్, ,ట్రస్ట్ దేవ భక్తుని రంగప్రసాద్ ,ఆలయ అర్చకులు తారకనాథ్, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గం అనుసరణీయం

### - స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంధం రవీందర్




సత్తెనపల్లి మేజర్ న్యూస్ : ప్రతి ఒక్కరూ శాంతి, సమాధానం, ప్రేమ కలిగి వుండాలని బోధించిన యేసుక్రీస్తు మార్గం అనుసరణీయమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంధం రవీందర్ అన్నారు. సత్తెనపల్లిలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ సండే స్కూల్ విద్యార్థులకు వారం రోజులు నిర్వహించిన విరామకాల బైబిల్ పాఠశాల తరగతులు ముగిశాయి. తరగతుల్లో నిర్వహించిన కంఠత వాక్యాలు, పాటలు, కథల పోటీల్లో ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంధం రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిభావంతులను ప్రశంసిస్తూ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవ. జె. ఇశ్రాయేలు వాక్య పరిచర్య చేశారు. వి.బి.ఎస్. ప్రతినిధులు గుజ్జర్లపూడి శ్రీదేవి, అహల్య, సంఘ అధ్యక్షుడు స్లైలాబ్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, కార్యదర్శి అనిరాజ్, సంయుక్త కార్యదర్శి కిషోర్ బాబు, కోశాధికారి రవిరాజు, స్త్రీలు, చిన్నారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి గంధం రవీందర్ ను సంఘ పెద్దలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# అన్ని ప్రాంతాలకు త్రాగునీటిని అందిస్తాం

## నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్:

గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతానికి సమగ్రంగా త్రాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా సమగ్ర త్రాగునీటి పథకం అమలుకు రూపొందించిన డిపిఆర్ పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్వహించిన సమావేశంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2014 నుండి 24/7 త్రాగునీరు అందిస్తామని జిఎంసి ప్రకటిస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తుతుందని, రానున్న కాలంలో ప్రతి ప్రాంతానికి నీటిని పుష్కలంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోరంట్ల కొండ మీద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనుల పురోగతిపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి వారం పురోగతిపై నివేదిక అడిగారన్నారు. కనుక జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన గోరంట్ల ప్రాజెక్ట్ పూర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరంలోని రిజర్వాయర్లను ప్రతి నెల నిర్దేశిత సమయానికి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని, అవసరమైన ప్రాంతాల్లో ఈఎల్ఎస్ఆర్ ల నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0ని రానున్న 30 ఏళ్ల వరకు ప్రజలకు త్రాగునీటి అవసరాలను అంచనా వేసి అమృత్, యుఐడిఎఫ్ నిధుల ద్వారా షుమారు రూ.540 కోట్ల అంచనాలతో డిపిఆర్ రూపొందించామని, పనులను 2 ఏళ్ల కాల పరిమితితో పూర్తీ చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామ న్నారు. ఈ ప్రాజెక్ట్ లు పూర్తయితే నగర ప్రజలకు త్రాగునీటి సమస్య ఎక్కడా తలెత్తే అవకాశం ఉండదన్నారు. డిపిఆర్ పై ప్రజా ప్రతినిధులు, స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్లు అందించే సూచనలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. తొలుత సిఆర్డీఏ మాజీ సిఈ ఆంజనేయులు పిపిటి ద్వారా డిపిఆర్ ని వివరించారు. అనంతరం కార్పొరేటర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపారు. సమావేశంలో ఎంఎల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ డి.శ్రీనివాస్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, రేట్ పెయర్స్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల్ని ప్రభావితం చేస్తున్న పవన్ కళ్యాణ్ భావజాలం

### ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్

గుంటూరు మేజర్ న్యూస్:

దేశం మీద అమితమైన భక్తి , సమాజం పట్ల బాధ్యత , ప్రజలపై గురుతరమైన ప్రేమ , పరిపాలనలో పారదర్శకత , ప్రకృతి, భాషా , సంస్కృతులు , పర్యావరణ పరిరక్షణలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ముందుకు సాగుతున్న జనసేనాని పవన్ కళ్యాణ్ భావజాలం ప్రజల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్ అన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పనులను , సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హరిప్రసాద్ సూచించారు. మోదీ ఆశీస్సులతో చంద్రబాబు నాయుడు ,పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని , అందుకే ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వం అంటున్నారని హరిప్రసాద్ అన్నారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ ను ఆళ్ళ హరి ప్రత్యేకంగా కలిశారు.



## నూతన జూనియర్ సివిల్ జడ్జిగా ప్రవళ్ళిక



పిడుగురాళ్ళ, మేజర్ న్యూస్ :

పిడుగురాళ్ల నూతన జూనియర్ సివిల్ జడ్జిగా టి ప్రవళ్ళిక సోమవారం బాధ్య తలు తీసుకున్నారు. నూతన జడ్జిగా బాధ్యతలు తీసుకున్న ప్రవళ్ళిక ను పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె కుమారస్వామి, సెక్రటరీ కోపూరి వెంకటేశ్వర్లు,సీనియర్ మెంబెర్ దారచె న్నయ్య, మెరుగుమల్ల శ్రీని వాసరావు, కె వి స్ కోటేశ్వరరావు, వై వెంకటేశ్వర్లు తదితరులు కలిసి శుభాకాం క్షలు తెలిపారు.

## లారీ ఢీకొని గేదె మృతి




పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :

పిడుగురాళ్ళ మండలం వీరాపురం శివారు శాంతినగర్ వద్ద సోమవారం మధ్యాహ్నం గేదెను వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వీరాపురం గ్రామానికి చెందిన దూదల బాబురావు తండ్రి కామేశ్వరరావు తన పశువులను మేపుకొని ఇంటికి వస్తున్న సమయంలో లారీ వేగంగా ఢీకొనటంతో రూ.50 వేల రూపాయల విలువైన తన గేద మరణించిందని వాపోయారు. అధికారులు స్పందించి తనకు సహాయం అందించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## 175 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ

పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పిడుగురాళ్ల పట్టణంలోని చైతన్య గ్రామీణ బ్యాంకు నుండి సుమారు 175 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని మాచవరం మండలం చెన్నాయపాలెం వెళుతుండగా బ్రాహ్మణపల్లి సమీపంలో చూసుకోగా ఆభరణాలు ఉన్న బాక్స్ కనిపించకపోవడంతో బాధితులైన ఎడ్లపల్లి పుల్లారావు, ఏటుకూరి నరసమ్మ పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ కు చేరుకొని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన ఏటుకూరి నరసమ్మ, ఎడ్లపల్లి పుల్లారావు, అక్క , తమ్ముళ్లు వారి కుటుంబానికి చెందిన వివాహ సందర్భంగా పిడుగురాళ్ల చైతన్య బ్యాంకులో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారు ఆభరణాలు తీసుకొని పిడుగురాళ్ల నుంచి ఆటోలో చెన్నాయపాలెం గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బ్రాహ్మణపల్లి చేరుకున్నప్పుడు కొంతమంది ఆటో నుండి దిగి వెళ్లారు. అప్పటికే సమయం మధ్యాహ్నం 12 గంటలు అయింది. తమ సంచిలో పెట్టిన బంగారం బాక్సును చూసుకోక ఆ బాక్స్ కనిపించక ఆందోళనకు గురైంది. అక్కడ గ్రామస్తులు సూచన మేరకు వెంటనే పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్కు చేరుకొని ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ మంత్రి, బీసీ నేత విడుదల రజిని పోలీసులు తీరును ఖండించిన సత్తెనపల్లి బీసీ నాయకులు




**సత్తెనపల్లి, మేజర్ న్యూస్:** వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెక్రెటరీ రాజా వరపు శివ నాగేశ్వర రావు మాట్లాడుతూ మాజీ మంత్రి అని గౌరవించకుండా విడుదల రజిని గారిపై పోలీసులు ప్రవర్తించిన తీరు బీసీల గౌరవాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. బిసి పట్టణ అధ్యక్షులు తుమ్మల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళ అని చూడకుండా రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన విడుదల రజిని పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు మహిళలల గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు.బీసీ నాయకులు తిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల పట్ల కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నట్టు వారి చర్యలు ఉన్నాయని అన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ వరి కళ్ళు కోటేశ్వరావు మాట్లాడుతూ మహిళల పట్ల కూటమి ప్రభుత్వానికి గౌరవం లేదని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు బిసి నాయకులు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలి

### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులకు సంబంధించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావులు, విభాగాధిపతులు కమిషనర్ చాంబర్లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్లు తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి 17 ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పిజిఆర్ఎస్ ద్వారా 37 ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం 17, ఇంజినీరింగ్ విభాగం 12, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 1, ఉపా సెల్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదు అందాయ న్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన అర్జీలను విభాగాల వారిగా విభజించి, సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ బాష, విభాగాల సూపరింటెండెంట్లు, ఎస్ఎస్ లు తదితరులు పాల్గొన్నారు.

## రిలేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధ వృద్ధులకు దుస్తులు పంపిణీ



గుంటూరు సిటీ మేజర్ న్యూస్ : సమాజంలో నిరాధారణకు గురైన పేద ప్రజలను వృద్ధులను ఆదుకోవడంలో పెద్ద కొడుకు పాత్ర వహించడం వారికి వారే సాటి సోమవారం పట్టాభిపురం, రవీంద్ర నగర్ లోని అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోమ్ కు హైదరాబాద్ కు చెందిన రిలేబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మూడు నెలలకు సరిపడా నిత్య అవసరాలతో పాటు కూలర్లు టీవీ లు ఫ్యాన్లు దుస్తులు దుప్పట్లు గీజర్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు రవి మాట్లాడుతూ పేద ప్రజలకు వృద్ధులకు సేవ చేసుకునే అదృష్టం కల్పించినందుకు ఆ భగవంతుడికి రుణపడి ఉంటాను అని అన్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు అనంత స్వాతి మాట్లాడుతూ రవి చేస్తున్న సేవా కార్యక్రమాలు కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఆశ్రమం నిర్వాహకురాలు అనంత స్వాతి వృద్ధులకు ఆశ్రయం కల్పించినందుకు రవి శుభాకాంక్షలు తెలిపారు.

# మోకాళ్ళ నొప్పులకు దారి తీసే అధిక బరువు

## - డాక్టర్ పి .సీతారాం ప్రసాద్, ఆర్థోపెడిక్ సర్జన్




**గుంటూరు మేజర్ న్యూస్ :** శరీర అధిక బరువు (ఊబకాయం), మధుమేహం ,అధిక రక్తపోట్లతో పాటు మోకాళ్ళ నొప్పులకు దారితీస్తుందని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, శ్రీరామ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రతినెల రెండవ ఆదివారం 2/1 బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ మీటింగ్ హాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం– శాస్త్రీయ ఆరోగ్య పరిరక్షణ సభలో డాక్టర్ సీతారాం ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు.సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ సీతారాం ప్రసాద్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ గతంలో పోల్చితే ఇప్పుడు మోకాళ్ళ నొప్పులు బాధితులు పెరిగిపోతున్నారన్నారు. జీవన శైలిలో ,ఆహారపు అలవాట్లలో మార్పులే అందుకు కారణం అన్నారు. శరీర బరువు పెరిగిన కొద్దీ మోకాళ్ళపై ఒత్తిడి పెరిగిపోతుందని శరీర బరువు పెరగడంతో పాటు ,నేటి నగర ప్రజలే కాకుండా గ్రామీణ ప్రజల్లో కూడా సిమెంట్ రోడ్లపై మీద నడుస్తున్నారని దీని ప్రభావం కూడా పరోక్షంగా కీళ్లపై పడుతోందన్నారు. ఫలితంగా మోకాళ్ళలోని గుజ్జు అరిగిపోవడం ,పక్కకు తొలగిపోవడం వల్ల ఎముకల మధ్య రాపిడి పెరిగిపోతుందన్నారు. అందువల్ల మోకాళ్ళ వాపు, నొప్పి సంభవిస్తున్నాయన్నారు. అలానే రక్తంలో షుగర్ శాతం అసాధారణంగా ఉండటం వల్ల కండరాలు , వాటిని ఎముకకు లేదా కీళ్లకు అంటిపెట్టుకొని ఉంచే తెండాన్ లు ఇన్ఫ్లమేషన్ కు గురై నొప్పులు రావడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భుజాలు నొప్పులకు గురికావటం జరుగుతోందన్నారు. దీనిని ఫ్రోజెన్ షోల్డర్ అంటారన్నారు. దీనివల్ల భుజాల కదలికలు నియంత్రించబడి, నొప్పిని కలిగి స్తాయన్నారు. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, షుగర్ నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా కీళ్ల సమస్యలను చాలావరకు నిరోధించవచ్చునన్నారు .నేడు చాలా మందిలో విటమిన్ డి లోపం ఎక్కువగా కనపడుతుందన్నారు .ప్రజలు ఎక్కువగా ఎండలో ఉండకపోవడమే అందుకు కారణమన్నారు. కంప్యూటర్లను, మొబైల్ ఫోన్లను ఎక్కువగావాడే వారిలోనూ ,ఉద్యోగాలు రీత్యా కదలకుండా కూర్చునే వారిలోనూ ఎక్కువగా మెడ నొప్పులు ,నడుం నొప్పి వస్తున్నాయన్నారు. ఆఫీసులలో గంటల తరబడి కూర్చునే వారు తగిన జాగ్రత్తలు, శాస్త్రీయ విధానాలు, పద్ధతులు తెలుసుకొనిపని చేసుకోవడం ద్వారా ఆ సమస్యల్ని చాలా వరకు అధికమించవచ్చునన్నారు. సభలో పాల్గొన్న సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణకు కొంత సమయం కేటాయించక తప్పదన్నారు. వ్యాధుల బారిన పడ్డాక వైద్యునిసంప్రదించడం కంటే ముందు జాగ్రత్తలతో ఆరోగ్య సమస్యలను నిరోధించాలన్నారు .ఫలితంగా ఆర్థిక ,ఆరోగ్య నష్టాలను నిరోధించవచ్చునన్నారు. ఆ లక్ష్యం కోసమే ప్రతినెల రెండవ ఆదివారం ఒక స్పెషలిస్ట్ తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజలు మధుమేహం ,అధిక రక్తపోటు ఊబకాయం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభాధ్యక్షులు టి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు .ఆహార నియమాలు జీవనశైలిలో మార్పులు మన ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆ లక్ష్యంతోనే తమ సంస్థలు ద్వారా ఆరోగ్య పరిరక్షణపై శాస్త్రీ అవగాహన సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ మేనేజర్ పి .నిర్మల రాణి ,ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ చల్లా చైతన్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కే .సతీష్ కోశాధికారి టీవీ సాయిరాం, సభ్యులు ఎన్ సాంబశివరావు, ఎం.రామారావు సిహెచ్. శివాజీ ,సిహెచ్ .లక్ష్మి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. సభానంతరం డాక్టర్ పి సీతారాం ప్రసాద్ ఎముకలు, కీళ్ల నొప్పుల బాధితులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు.

## కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

**-సీఐటీయూ నాయకులు పల్లె కృష్ణ**



తాడేపల్లి, మేజర్ న్యూస్: కనీస వేతన చట్ట ప్రకారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో సోమవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను కలిసి, మే 20వ తేదీన జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు వ్యతిరేకంగా అనేక చట్టాలు చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చారని ఆయన విమర్శించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మికుల పొట్ట కొట్టే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని అమలు చేయాలని, భవన నిర్మాణ, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా అన్ని ట్రేడ్ యూనియన్లు సమ్మెకు పిలిపిచ్చాయని అన్నారు. ఒకవైపున పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. తక్షణమే కార్మికుల మెడకు ఉరితాళ్ళుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలని సిఐటియు, వివిధ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఈనెల 20వ తేదీ జరుగు సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెంకన్న, వెంకటేశ్వర్లు, రమేష్, సుబ్రమణ్యం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**వ్య.కా.స. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు**

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

మంగళగిరి రూరల్ గ్రామాలలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకొని నివాసముంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. , అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి అప్పారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వివిధ రకాల భూముల్లో నివాసం ఉంటున్న వారందరికీ ప్రభుత్వం ఉన్న ఇబ్బందులను తొలగించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు గ్రామ పరిధిలోని నిమ్మగడ్డ రామ్మోహన్ రావు నగర్, వైయస్సార్ నగర్, కాజ గ్రామంలోని పుల్లయ్య నగర్, చినకాకాని గ్రామాల్లో వివిధ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో ఇల్లు వేసుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో చెరువు పోరంబోకు స్థలాల్లో ఇల్లు వేసుకొని నివాసముంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో సెంటు భూమి ఇచ్చిన పేదలకు నివాస ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు వివి జవహర్లాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి భూమిలో నైనా ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదలందరికీ పట్టాలిస్తానని ఇచ్చిన హామీని మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం ర్యాలీగా పాత తాసిల్దార్ కార్యాలయం వరకు చేరుకొని తాసిల్దార్ కు వినతి పత్రాలు, దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో ఆత్మకూరు వరకు సర్వే చేసి పట్టాలిస్తామని తెలియజేశారు. గ్రామాల్లో కూడా సర్వే చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి రామారావు, అధ్యక్షులు కే వెంకటేశ్వరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యు దుర్గారావు, కే బాబు వరప్రసాద్, సిహెచ్ సీతా రామాంజనేయులు, అజయ్, కాజా శివశంకరరావు, నరసింహారావు, ఎస్ నిర్మల, కే గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సులు సేవామూర్తులు

**-యూపీహెచ్ సీ లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం**



మంగళగిరి, మేజర్ న్యూస్:

నగరంలోని ఇందిరానగర్ యూపీ హెచ్‌సీలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ లోని స్టాఫ్ నర్స్, ఎనిమిది మంది ఏఎన్ఎం లను ఘనంగా సన్మానించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, నర్సులను శాలువాలతో సత్కరించి పూల మొక్కలను అందజేశారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని నర్సుల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ ప్రతి ఏడాది నర్సుల దినోత్సవంకు ఒక థీమ్ ప్రకటిస్తుందని, ఈ ఏడాది నర్సులు నాయకత్వం వహించడానికి ఒక స్వరం-నాణ్యత అందించడం, సమానత్వాన్ని కాపాడుకోవడం అనే థీమ్ ను ప్రకటించిందన్నారు. నర్సులు సేవామూర్తులని చికిత్స చేయించుకోవడానికి హాస్పటల్ కి వచ్చిన రోగులను తిరిగి బయటకు వెళ్లే వరకు తమ పిల్లలగా భావించి విసుకు చెందకుండా అహోరాత్రులు శ్రమిస్తున్న చల్లని దేవతలు అన్నారు. ప్రపంచంలో నర్సింగ్ వృత్తిని సేకరించిన మొట్టమొదటి మహిళ ఫ్లోరెన్స్ నైటింగేల్ అన్నారు. నైటింగేల్ కరెంటు లేని రోజులలో దీపం పట్టుకొని తిరుగుతూ యుద్ధంలో గాయపడ్డ సైనికులకు రోజుకు 20 గంటలు సేవలందించిందన్నారు. నైటింగేల్ ను స్ఫూర్తిగా తీసుకొని నర్సులు రోగులందర్నీ సమానంగా చూస్తూ రోగులకు మరిన్ని మెరుగైన సేవలందించాలని డాక్టర్ అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ వరలక్ష్మి, ఏఎన్ఎంలు ఝాన్సీ, విజయ, సుజాత, విజయలక్ష్మి, కవిత, జ్యోతి, సరిత, ఆదిలక్ష్మి, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉండవల్లిలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన



తాడేపల్లి, మేజర్ న్యూస్:

రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లిలో సోమవారం పని విరామ సమయంలో లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మే 20 న జరిగే కార్మిక సమ్మె లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్మికులకు ఉరి తాళ్లుగా మారే లేబర్ కోడ్ లను తక్షణం ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు.లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులన్నీ హరించుకు పోతాయని రవి ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాల చెల్లింపు చట్టం , కనీస వేతనాలు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం రద్దవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. దీనివల్ల కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని చెప్పారు. ఇవే కాకుండా సామాజిక భద్రత చట్టాలన్నీ రద్దు అవుతాయని అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం, 17 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్ ల సాధన కోసం మే 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని రవి కోరారు. ఈ కార్యక్రమంలో ఎం టిఎం సి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి కే మరియమ్మ శాంతకుమారి జయలక్ష్మి సుజాత ఉషారాణి సునీత తదితరులు పాల్గొన్నారు.

## 20 న జరుగు సమ్మె జయప్రదం చేయండి

**తెనాలి, మేజర్ న్యూస్**

లేబర్ కోడ్స్ వద్దు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కొల్లిపర మండల కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ పిలుపునిచ్చారు సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎం జయప్రద అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథి బాబు ప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలు అయితే కార్మిక చట్టాలు వర్తించవని కార్మిక వర్గం బానిసత్వంలోకి నెట్టబడే పరిస్థితి వస్తుందని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా గాని అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ మే 20న కార్మిక వర్గం జరిపే సమ్మెకు రైతు సంఘం జాతీయస్థాయిలో మద్దతు ప్రకటించిందని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతాంగం కూడా కోరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి శేషా రత్నం ఎం వసంతకుమారి వరలక్ష్మి కుర్ర శివ లీల అరుణ తిరుపతమ్మ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# లెదర్ పార్కుల నిర్మాణం చేపట్టాలి

**-ఏపీ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు**

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

రాష్ట్రంలో మాదిగల అభ్యున్నతికి లెదర్ పార్కుల నిర్మాణం కోసం ప్రభుత్వం వివిధ జిల్లాల్లో కేటాయించిన 742 ఎకరాల భూమి ఉందని, ప్రభుత్వం చొరవ తీసుకొని లెదర్ పార్కుల నిర్మాణం జరపాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు అన్నారు. చర్మకారుల సమస్యలపై రాష్ట్రంలో నాలుగు విడతలుగా రాష్ట్ర పర్యటన ముగించుకున్న బుల్లా రాజారావును సోమవారం స్థానిక తెనాలి రోడ్డులోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద చర్మకారుల నాయకులు సత్కరించారు. అనంతరం బుల్లా రాజారావు మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ నుండి రాష్ట్రంలో నాలుగు విడతలుగా పర్యటించి ఆయా ప్రాంతాల్లోని చర్మకారుల సమస్యలను, ప్రభుత్వ లెదర్ పార్కులకు కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలతో కూడిన వినతి పత్రాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం లెదర్ పార్కుల నిర్మాణంకు భూమి కేటాయించి, పార్కులు నిర్మాణం జరపని భూములను గుర్తించి, వాటి వివరాలను గత నెలలో ఎన్టీఆర్ భవన్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 19 జిల్లాలలో లెదర్ పార్కుల నిర్మించుటకు ప్రభుత్వం కేటాయించిన 742 ఎకరాల భూమి సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లెదర్ పార్కులు విదేశీ కంపెనీలు గాని, ప్రైవేట్ కంపెనీల ద్వారా గాని నిర్మాణం చేసిన యెడల వేలాదిమంది మాదిగ నిరుద్యోగ యువతీ, యువకులకు జీవనోపాధి కలుగుతుందన్నారు.



ప్రభుత్వం లెదర్ పార్కుల నిర్మాణంకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చర్మకార సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పీ రాజశేఖర్, నాయకులు కే సుబ్బారావు, కె రవికుమార్, ఎస్ ప్రకాష్, ఎన్ కె రాజు, కె కాశిం పీరా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో నర్సుల సేవలు ప్రశంసనీయం

- ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భేటీ
- ప్రశంసనీయ సేవలు అందించిన ఎనిమిది మందికి సత్కారం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో... రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొనియాడారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యాన్ని, సాంత్వన కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో సమావేశం అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రశంసనీయ సేవలు అందించిన ఎనిమిది మంది స్టాఫ్ నర్సులను సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మీరు విధులు నిర్వర్తించిన విధానం మరువలేం.

ఇటీవల సింగపూర్ లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురైనప్పుడు ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకువచ్చింది. మిమ్మల్ని కలసి మీరు అందించే సేవలు మరచిపోలేనివి అని చెప్పి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మిమ్మల్ని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తామ"ని తెలిపారు.



# అమరావతి రాజధాని నిర్మాణానికి నిధుల వరద

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ అందులకు నిధులు వరద ప్రవాహంలో భారతదేశ కీర్తి కిరీటంలో అమరావతిని అత్యున్నత రాజధానిగా నియమించేందుకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తులో వ్యూహరచన చేస్తోంది.అందుకు తగ్గట్లు అవకాశమున్న చోట పెద్ద ఎత్తున నిధులను కూడా సమీకరిస్తోంది. అదనంగా అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయస్థాయిలో వసతులు సమకూరుస్తూ క్రికెట్ స్టేడియాన్ని అమరావతిలో నిర్మించేందుకు కూడా సకల సన్నాహాలు చేస్తున్నారు.అవకాశాన్ని బట్టి పెద్ద ఎత్తులో రెండో విడత భూముల సేకరణ చేసేందుకు కూడా సర్కార్ ప్లాన్ గా ఉంది. ఈ మేరకు 44 వేల ఎకరాల భూమిని సేకరించేందుకు రూపకల్పన చేస్తున్నారు.ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి ప్రాంత రైతులతో ఈ విషయమై సమావేశమై వారితో చర్చించారు .అయితే భూమిని ఇవ్వటానికి కొంత మంది రైతులు సుముఖంగా, మరికొందరు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. రైతులతో మరోసారి మాట్లాడి వారి అనుమతి తీసుకుని ముందుకు సాగాలని నిర్ణయించింది.ప్రభుత్వం దీనికి సంబంధించి సి ఆర్ డి ఏ అధికారులు కూడా వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారు.ఇప్పటికే కొన్ని పనులకు టెండర్లు పిలిచారు.టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్ణయించిన గడువు లోగా కచ్చితంగా పందులు పూర్తి చేయాలని ప్రభుత్వం . ఆదేశించింది.రాజధాని నిర్మాణానికి దండిగా నిధులు ఉండటంతో పనులు చేసే కాంట్రాక్టర్లకు కూడా జాప్యం లేకుండా బిల్లులు చెల్లించి సకాలంలో పూర్తిచేసేలా ప్లాన్ చేస్తున్నారు. తొలి విడతగా పనులను రూ. 77,249.15 వేల కోట్లు అంచనాతో చేపట్టినట్లుగా ప్రభుత్వం చెబుతోంది. ఈ పనులు త్వరిత ప్రారంభంకాలు ఉన్నాయి.. ఈనెల 2 తేదీ భారత ప్రధాని నరేంద్ర అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ఈనెల రెండవ తేదీ శంకుస్థాపన చేశారు,. రాష్ట్రంలోఒకవైపు లోటు బడ్జెట్.. మరోవైపు అప్పుల భారం ఉన్నప్పటికీ రాజధాని నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

మరి ఇన్ని వేల కోట్ల రూపాయల నిధులు ఏపీ ప్రభుత్వం ఎక్కడి నుంచి తెస్తుంది? అమరావతి నిర్మాణ పనులకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి? నిధులు ఎలా తెస్తున్నామో కూడా ప్రభుత్వం చెబుతోంది. దీనిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగులేటి నారాయణ అనేక అంశాలను ప్రస్తావించారు.

ఇప్పుడు చేపట్టనున్న అమరావతి పునర్నిర్మాణ పనులలో భాగంగా మొత్తం 100 పనులను రూ.77,249 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లుగా రాష్ట్ర మంత్రి నారాయణ చెబుతున్నారు. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ చెరో రూ. 6,700 కోట్లు చొప్పున రూ.13,400 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించాయి. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ. 5వేల కోట్లు ఇస్తోంది" . వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వచ్చిన మొత్తంతో పాటు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కలుపుకొని ఈ ఏడాది ఏప్రిల్ 1న రూ.4,285 కోట్లు ఏపీకి అందాయని ప్రభుత్వ చెబుతోంది ఇవి కాకుండా హడ్కో నుంచి రూ.11వేల కోట్లు రుణంగా తీసుకోనుంది ఏపీ ప్రభుత్వం. ఇందుకు సంబంధించి సమ్మతి లేఖ (లెటర్ ఆఫ్ కన్సెంట్)ను తమ ప్రభుత్వం అందించింది. కొంత ప్రభుత్వ "బ్యాంకులు, ఫండింగ్ ఏజెన్సీల నుంచి తీసుకోగా.. మిగిలిన నిధులను భూములు మార్ట్‌గేజ్ చేయడం, విక్రయాలు, లీజుకు ఇవ్వడం ద్వారా సేకరించబోతున్నాం అది ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. అయితే, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వస్తున్న రుణ భారం పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏపీ ప్రజలపై పడే వీలుందని విజయవాడకు చెందిన ఆర్థిక శాస్త్ర నిపుణుడు ఒకరు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తన బ్యాలెన్స్ షీట్‌లోకి ఈ రుణాలను తీసుకుంటేనే ఏపీ భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు . ఇవి కాకుండా హడ్కో నుంచి రూ.11వేల కోట్లు రుణంగా తీసుకోనుంది ఏపీ ప్రభుత్వం. ఇందుకు సంబంధించి సమ్మతి లేఖ (లెటర్ ఆఫ్ కన్సెంట్)ను అందించింది. "బ్యాంకులు, ఫండింగ్ ఏజెన్సీల నుంచి తీసుకోగా.. మిగిలిన నిధులను భూములు మార్ట్‌గేజ్ చేయడం, విక్రయాలు, లీజుకు ఇవ్వడం ద్వారా సేకరించబోతున్నారు అయితే, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వస్తున్న రుణ భారం పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏపీ ప్రజలపై పడే వీలుందని విజయవాడకు చెందిన ఆర్థిక శాస్త్ర నిపుణుడు ఒకరు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తన బ్యాలెన్స్ షీట్‌లోకి ఈ రుణాలను తీసుకుంటేనే ఏపీ భారం తగ్గుతుందని వివరించారు. అలాగే, 'మల్టీలేటరల్ లోన్ అసిస్టెన్స్' పేరుతో అమరావతి నిర్మాణానికి అప్పులు ఇస్తున్నామని చెబుతోంది కేంద్ర ప్రభుత్వం. వివిధ సంస్థలు లేదా బ్యాంకుల నుంచి ఈ రుణాలు ఏపీకి అందనున్నాయి. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అవసరాన్ని గుర్తించి, మల్టీలేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు సమకూరుస్తాం. వచ్చే సంవత్సరాల్లోనూ అదనపు నిధులు సమకూరుస్తాం' అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల చెప్పింది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ధీమా కలిగించింది. 2025-26 కేంద్ర బడ్జెట్ లో దీనిపై ప్రకటన కూడా చేశారు. ఈ రూ.15 వేల కోట్లు గ్రాంటా, లేక రుణమా అనేది ఆ ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. కానీ, ఆ రూ.15 వేల కోట్లతో పాటు చాలా వరకూ రుణాలు, రాష్ట్ర ప్రభుత్వానికి అందేలా కేంద్రం ఫెసిలిటేట్ చేస్తుందని, వాటితో పాటుగా కొంత గ్రాంటు కూడా ఉంటుందని తర్వాత పరిణామాల్లో పలు ప్రకటనల ద్వారా స్థూలంగా తేలింది.

**విభజన చట్టం ఏం చెబుతోంది?**

- ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ 94(3) ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి అవసరమైన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలనే నిబంధన ఉంది.
- దీని ప్రకారం, ఇప్పటివరకు "స్పెషల్ అసిస్టెన్స్ (గ్రాంట్లు)" రూపంలో ఏపీ రాజధాని ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,500 కోట్లు ఇచ్చినట్లు కేంద్రం చెబుతోంది. ఈ ఏడాది మార్చిలో లోక్ సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దీనిపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.
- అమరావతి కోసం చేసే అప్పులు ఏపీ తీసుకునే రెగ్యులర్ రుణ పరిమితి (సీలింగ్) కిందకు రావని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, వరల్డ్ బ్యాంకు రుణానికి ఈ ఏడాది జనవరి 22 నుంచి, ఏడీబీ ఇచ్చే అప్పులకు ఫిబ్రవరి 10 నుంచి లోన్ టర్మ్ మొదలైందని కేంద్రం చెప్పింది.
- తాజాగా ప్రాజెక్టు ఖర్చులో పది శాతం మించకుండా (గరిష్ఠంగా రూ.1500 కోట్లు) 'స్పెషల్ అసిస్టెన్స్' కింద ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం గ్రాంటు కింద రూ.1,560 కోట్లు ఇస్తోందని ఏపీ మంత్రి నారాయణ కూడా వెల్లడించారు.
- వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, హడ్కో.. ఇలా వివిధ సంస్థల నుంచి తీసుకువస్తున్న అప్పులతో అంతిమంగా ప్రజలపైనే భారం పడుతుందని ఆంధ్ర ఇంటలెక్చువల్ ఫోరం వెల్లడించింది
- "స్పెషల్ అసిస్టెన్స్ పేరుతో డబ్బులు ఇస్తున్నామని అంటున్నారు. వాటిని సీఆర్డీఏనే చెల్లించాలి. అది కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం కట్టాలి. రాష్ట్రం కట్టకపోతే కేంద్రంపై భారం పడుతుంది. కానీ, కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆంధ్రప్రదేశ్ నుంచే రికవరీ చేస్తుంది.'
- మంత్రి నారాయణ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే వెల్లడించారు.
- అయితే, దీనిపై మంత్రి నారాయణ ఇటీవల మాట్లాడుతూ, ప్రజలపై ఒక్క రూపాయి భారం పడకుండా అమరావతి నిర్మిస్తున్నామన్నారు.
- "గతంలో ల్యాండ్ పూలింగ్‌లో సేకరించిన భూమిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కూడా ఇచ్చేశాం. అవి పోగా, సీఆర్డీయేకి 4 వేల ఎకరాల భూమి మిగులుతుంది. ఆ 4 వేల ఎకరాలను భవిష్యత్తులో వేలం వేసి, రాజధాని నిర్మాణానికి వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించేలా ప్రణాళికలు వేశాం" అని మంత్రి నారాయణ చెప్పుకొచ్చారు..

**బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు..**

- "అమరావతి అనేది సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నగరాన్ని నిర్మిస్తున్నాం" అని ప్రకటిస్తూ వస్తున్నారు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. చెబుతున్నారు
- ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) బడ్జెట్లో అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.6 వేల కోట్లు ప్రతిపాదించింది ఏపీ ప్రభుత్వం. ఇది ప్రతిపాదనే తప్ప కేటాయింపు కాదని కూడా వెల్లడించారు.
- ఏపీ బడ్జెట్‌లో గత పదేళ్లగా అమరావతికి జరిగిన నిధుల కేటాయింపులు పరిశీలిస్తే..
- 2015-16 బడ్జెట్ - రూ.3,168 కోట్లు
- 2016-17 - రూ.1,500 కోట్లు
- 2017-18 - రూ.1,061 కోట్లు
- 2018-19- రూ.1,000 కోట్లు
- 2019లో జగన్ ప్రభుత్వ హయాంలో జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు.
- అనంతరం, మూడు రాజధానుల విధానాన్ని తెరపైకి తీసుకొచ్చి వైసీపీ ప్రభుత్వం అమరావతిని పక్కనబెట్టింది. ఆ తర్వాత నిధుల కేటాయింపు జరగలేదు.
- మరోవైపు, 2025-26 బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లుగా ఉంటుందని సభకు చెప్పారు ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. కూడా దీనిపై స్పష్ట వైఖరి వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది మార్చి 31నాటికి రూ.5,62,557 కోట్లు అప్పు ఉందని మార్చి 25న లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంజక్ చౌదరి ఇటీవల చెప్పడం జరిగింది.

ఇప్పటివరకు ఎన్ని పనులు జరిగాయి? అనే దానిపై స్పష్ట వైఖరి ఉంది.

టీడీపీ ప్రభుత్వం 2019లో దిగేపోయే సమయానికి రూ.39,875 కోట్ల విలువైన పనులు నిర్మాణదశలో ఉన్నాయని అప్పట్లో సీఆర్డీఏ అధికారి ఒకరు చెప్పారని హిందుస్థాన్ టైమ్స్ 2019లో రాసిన ఓ కథనంలో పేర్కొంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుడు జులైలో అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేసింది.

దాని ప్రకారం, 2019కి ముందు ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు, రోడ్లు, ఇతరత్రా మౌలిక వసతుల కోసం రూ.51,687 కోట్లు అవసరమని అంచనా వేసింది.

ఇటీవల విలేఖరులతో మాట్లాడుతూ, 2014-19 మధ్య దాదాపు రూ.5 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పురపాలక శాఖ మంత్రి చెబుతున్నారు

అయితే, 2019కి ముందు రూ.51 వేల కోట్లతో అంచనాలు వేసిన ప్రభుత్వం, కేవలం 5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్న విమర్శలు కూడా వచ్చాయి. పెరిగిన అంచనాలపై కూడా స్పష్ట వైఖరి వెల్లడించారు

2019తో పోల్చితే నిర్మాణాల్లో అంచనా వ్యయాలు భారీగా పెరిగాయి.

"అప్పటి ఖర్చులతో పోల్చితే భవనాలు, ఇతరత్రా వసతులకు సంబంధించి నిర్మాణ వ్యయం రూ.12,392 కోట్లకు పెరిగింది" అని సీఆర్డీఏ తెలిపింది.

ఇందులో ఐకానిక్ టవర్ల నిర్మాణం 2018లో అంచనా వ్యయం రూ.2271.14 కోట్లుగా ఉండేది. ప్రస్తుతం అంచనా వ్యయం రూ.4,688 కోట్లకు పెంచింది.

మరోవైపు, తాజాగా అసెంబ్లీ భవన నిర్మాణం రూ.590 కోట్లు అంచనా కాగా 4.48 శాతం ఎక్సెస్ తో ఎల్ అండ్ టీ సంస్థకు రూ.617 కోట్లకు పనులు అప్పగించింది. హైకోర్టు భవన నిర్మాణానికి రూ.750 కోట్లు అంచనా వ్యయం కాగా, 4.52 శాతం ఎక్కువకు రూ.786 కోట్లకు ఎన్సీసీ సంస్థకు పనులు అప్పగించింది.